ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.7, కనిష్ఠం 23.0





- ఖరీఫ్‌లో భారీగా పెరిగిన వరి సాగు
- జిల్లాలో ఖరీఫ్ దిగుబడి అంచనా 11.94 లక్షల మెట్రిక్ టన్నులు
- ప్రభుత్వ బోనస్ ప్రకటనతో పెరిగిన సన్నరకాల సాగు
- ముందస్తుగానే కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధమవుతున్న అధికార యంత్రాంగం

జోరుగా వరి సాగు!

నిజామాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈ వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా వరి భారీగా సాగవుతోంది. వరి సాగు ఎక్కువ కావడంతో దిగుబడిపై అధికారులు అంచనా వేస్తున్నారు. వచ్చే నెలలో వరి కోతకు రానుండటంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమవుతున్నారు. వరి సాగువిస్తీర్ణం ఆధారంగా ఎంత దిగుబడి వస్తుందో అంచనా వేయడంతోపాటు దానికి అనుగుణంగా ధాన్యం కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ముందస్తుగా ఏర్పాట్లను చేస్తున్నారు. బోధన్ డివిజన్‌లో జూన్‌లో వరినాట్లు వేయడంతో అక్టోబర్ మొదటి వారంలో ధాన్యం రానుండటంతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధమవుతున్నారు. కొనుగోలుకు అవసరమైన సామగ్రిని సమకూర్చడంతో పాటు గోదాములు, మిల్లులను పరిశీలిస్తున్నారు. వరి దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయడంతోపాటు పూర్తిస్థాయిలో ధాన్యం కొనేందుకు సిద్ధమవుతున్నారు. వరిసాగు గణనీయంగా పెరగడం ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో ఈ దఫా సన్నరకాలు ఎక్కువగా సాగైంది. గతంతో పోలిస్తే ఈ దఫా ఎక్కువగా రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురానుండటంతో అధికారులు ఈ ఏర్పాట్లను ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనసాగిస్తున్నారు.

● 5.49 లక్షల ఎకరాల్లో పంటలు

జిల్లాలో ఈ ఏడాది 5లక్షల 49వేల 769 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. అయితే ఇందులో మొత్తం సాగు విస్తీర్ణంలో 4లక్షల 29వేల 796 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. గతేడాది కంటే 2వేల ఎకరాల్లో ఎక్కువగా వరి సాగవుతోంది. ఈఏడాది కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం సన్నరకాలు సాగుచేసే రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ప్రకటించడంతో రైతులు వరి సాగుకు ఎక్కువగా మళ్లారు. గతేడాది కంటే 9శాతం అత్యధికంగా వరి సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా చేసి ప్రభుత్వానికి వివరాలను పంపించారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో ఈఏడాది ఎక్కువ మొత్తంలో సాగవుతున్నట్లు అధికారులు అంచనా వేశారు. గత సంవత్సరం కంటే సన్నరకాల సాగు ఈ దఫా 20వేల ఎకరాలకు పైగా ఎక్కువగా జరిగినట్లు సర్వే ఆధారంగా గుర్తించారు. దానికి అనుగుణంగానే ప్రభుత్వానికి నివేదికల్లో పేర్కొన్నారు. ఈ ఏడాది వానాకాలంలో మొదట తక్కువగానే వరి సాగు అయినా ఆగస్టులో వర్షాలు పుంజుకోవడంతో సాగు గణనీయంగా పెరిగింది. జిల్లాలో 11లక్షల 94వేల 154 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనావేశారు. ఈదఫా మార్కెట్‌కు, కొనుగోలు కేంద్రాలకు 9లక్షల 85వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనావేశారు. ఈ ధాన్యంలో 8లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ ద్వారా కొనుగోలుచేయాలని నిర్ణయం తీసుకున్నారు. మిగతా ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేసే అవకాశం ఉందని అంచనా వేశారు.

● కొనుగోళ్లకు ఏర్పాట్లు

జిల్లాలో వచ్చేనెల మొదటి వారంలో ధాన్యం చేతికి రానుండటంతో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో కొనుగోలు చేసేందుకు నిర్ణయం తీసుకుంటున్నారు. వచ్చే ధాన్యానికి అనుగుణంగా ఈ దఫా 480 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. వీటిలో ఐకేపీ ద్వారా 52, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా 388, డీసీఎంఎస్ ద్వారా 29, మెప్మా ద్వారా 6, ఇతర సంఘాల ద్వారా 5 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కొనుగోలుకు అవసరమైన గన్నీ బ్యాగులు, టార్పాలిన్‌ల కోసం ముందస్తు ఏర్పాట్లను చేస్తున్నారు. అవసరమైన వాహనాలను కూడా సమకూర్చుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన టెండర్లు ఖరారు చేయడంతోపాటు మొత్తం ఏర్పాట్లను చేస్తున్నారు. కొనుగోలు చేయడంతోపాటు ధాన్యాన్ని తరలించేందుకు హమాలీలను కూడా ముందస్తుగానే సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో కొనుగోలుచేసిన ధాన్యాన్ని ఉంచేందుకు కావాల్సిన గోదాంలను కూడా పరిశీలిస్తున్నారు. మిల్లర్ల కెపాసిటీతో పాటు కొనుగోలు చేసే ధాన్యానికి అనుగుణంగా నిలువ చేసేందుకు ముందస్తుగానే ఏర్పాట్లను చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు మొదలు పెట్టగానే గుర్తించిన మిల్లులకు కేటాయించడంతోపాటు వెంట వెంటనే తరలించే విధంగా ఈ ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లాలో ఈ దఫా వానాకాలంలో వరిసాగు ఎక్కువగా కావడం వల్ల ధాన్యం కొనుగోళ్ల కోసం ముందస్తు ఏర్పాట్లను చేస్తున్నామని జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రమేష్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో పాటు కొనుగోలుకు అవసరమైన గన్నీ బ్యాగులు, ఇతర సామగ్రిని ముందస్తుగానే సమకూర్చుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.



పోచారానికి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

పోచారానికి శుభాకాంక్షల వెల్లువ

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 14: రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడిగా శనివారం నాంపల్లి పబ్లిక్ గార్డెన్‌లోని రాష్ట్ర ఉద్యానవన శాఖ భవనంలో బాధ్యతలు స్వీకరించిన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి రాష్ట్ర మంత్రులు, జిల్లాకు చెందిన పలువురు నేతలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రమంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్‌అలీ, జితేందర్‌రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, మాజీమంత్రి సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేషన్ చైర్మన్లు కాసులబాల్‌రాజ్, ఈరవత్రి అనిల్ కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

షబ్బీర్ అలీని కలిసిన మహేష్‌కుమార్‌గౌడ్

టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్ శనివారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన అనంతరం ఆయన పలువురు మంత్రులను, ముఖ్యనేతలను మర్యాదపూర్వకంగా కలుస్తున్నారు.



షబ్బీర్ అలీని కలిసిన మహేష్‌కుమార్‌గౌడ్

● నేడు బాధ్యతల స్వీకరణ

టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్ ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు. గాంధీభవన్‌లో జరిగే బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్దసంఖ్యలో కాంగ్రెస్ నేతలు తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాకు చెందిన ముఖ్యనేతలతోపాటు మహేష్‌కుమార్‌గౌడ్ అభిమానులు, నాయకులు రాజధానికి వెళ్లనున్నారు.

పీఆర్‌టీయూలో ఎన్నికల సందడి

నిజామాబాద్‌అర్బన్, సెప్టెంబరు14: ఉపాధ్యాయ సంఘాల్లో అతిపెద్ద సంఘమైన పీఆర్‌టీయూలో ఎన్ని కల సందడి నెలకొంది. ఆదివారం పీఆర్‌టీయూ జిల్లానూతన అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికలు జరుగనున్నాయి. శనివారమే జిల్లాకార్యవర్గ సమావేశంతోపాటు ఎన్నికలు జరగాల్సి ఉండగా ప్రభుత్వం రెండవ శనివారం సెలవును రద్దు చేయడంతో ఆదివారానికి వాయిదా పడ్డాయి. ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి మోహన్‌రెడ్డి మరోసారి అధ్యక్షుడిగా పోటీ చేయనుండగా ప్రధాన కార్యదర్శి పదవి కోసం తీవ్రపోటీ నెలకొంది. బో ధన్‌కు చెందిన శంకర్, నిజామాబాద్‌కు చెందిన ప్రస్తుత ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌గౌడ్, నందిపేట్‌కు చెందిన కిషన్ పోటీ పడుతున్నారు. మొత్తం 195 ఓట్లు ఉన్నాయి. మండల అధ్యక్ష, కార్యదర్శులతోపాటు మండలాల కార్యవర్గాలు ఓటింగ్‌లో పాల్గొననున్నాయి. సాధారణ ఎన్నికలను తలపించేలా పీఆర్‌టీయూ ఎన్నికలు జరుగుతాయి. దీంతో ఈసారి కూడా ఎన్నికలు హోరాహోరీగా జరిగే అవకాశాలు ఉన్నాయి. అధ్యక్ష పదవికి ప్రస్తుత అధ్యక్షుడు మోహన్‌రెడ్డితోపాటు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రచ్చ మురళి, ఆర్మూర్‌కు చెందిన కృష్ణారెడ్డిలు పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. మోహన్‌రెడ్డితోపాటు మరో ఇద్దరు అభ్యర్థులు గెలుపు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

సొసైటీల్లో గోల్‌మాల్!

- 36 సొసైటీలకు నోటీసులిచ్చిన సహకార శాఖ అధికారులు
- నిధుల స్వాహాపై అసిస్టెంట్ రిజిస్ట్రార్లను నియమించి వివరాల సేకరణ
- ఇప్పటికే ఈ వ్యవహారంలో ఇద్దరు కార్యదర్శుల సస్పెన్షన్



నిజామాబాద్, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో కొన్ని సహకార సంఘాల్లో ఆడిటింగ్ సరిగ్గా జరగక నిధులు గోల్‌మాల్ అయ్యాయి. కొన్నిసంఘాల్లో పర్యవేక్షణ లేకపోవడంతో లక్షలాది రూపాయలు పక్కదారి పట్టాయి. గత కొన్నేళ్లుగా ఈ వ్యవహారం జరుగుతున్నా పూర్తిస్థాయిలో ఆడిటింగ్ లేక, జవాబుదారితనం లేకపోవడంతో నిధులు ఇతరపద్దులకు మళ్లించారు. ఎలాంటి అనుమతులు లేకుండానే లక్షల రూపాయలు ఖర్చుచేశారు. ఆదాయం ఉన్న సంఘాలతోపాటు లేని కొన్నిసంఘాల్లో కూడా ఈ వ్యవహారం జరిగింది. జిల్లాలోని కొన్ని సంఘాల్లో జరిగిన వ్యవహారాలపై డైరెక్టర్లు, కొంతమంది నేతలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు సహకారశాఖ అధికారులు దృష్టి పెట్టారు. జిల్లాలో 36 సొసైటీలకు నోటీసులు ఇవ్వడంతోపాటు ఆ సొసైటీలకు సంబంధించిన కార్యదర్శులు, చైర్మన్, డైరెక్టర్ల నుంచి వివరాలను సేకరిస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు సెక్రెటరీలను సస్పెండ్ చేసిన అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు అధికారులను నియమించి వివరాలను తీసుకుంటున్నారు. ఈ మధ్యే వేల్పూర్‌లోని పడగల్ సొసైటీలో కూడా ఇలాంటి వ్యవహారం బయటకు రావడంతో ప్రత్యేక అధికారిని నియమించి ఆడిటింగ్‌చేస్తున్నారు. ఎంతమొత్తం నిధులు పక్కదారి పట్టాయో వివరాలను తీసుకుంటున్నారు.

● జిల్లాలో 89 పీఏసీఎస్‌లు

జిల్లాలో 89 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. వీటిలో కొన్ని ఆర్థిక పరిపుష్టి ఉన్న సంఘాలుండగా, మరికొన్ని చిన్న సంఘాలు ఉన్నాయి. కొన్ని సంఘాల పరిధిలో రైస్‌మిల్లులతోపాటు గోదాములు ఉండగా మరికొన్ని సంఘాలకు కేవలం ధాన్యం కొనుగోలు, రుణాలు ఇవ్వడంపైనే ఆధారపడి పనిచేస్తున్నాయి. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సంఘాలన్నీ రైతుల కోసం ఏర్పాటుచేసినవి. రైతులకు రుణాలు ఇవ్వడంతోపాటు వసూలు చేసి సంఘాలను బలోపేతం చేసేలా వీటిని ఏర్పాటుచేశారు. రుణాలతోపాటు డిపాజిట్ల సేకరణ ఈ సంఘాలు చేస్తున్నాయి. వీటితోపాటు గత కొన్నేళ్లుగా రెండుసీజన్‌లో ధాన్యం కొనుగోలు కొనసాగిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా అన్నిసొసైటీల పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో ప్రతీ సొసైటీకి ఏడాదికి లక్షల్లో ఆదాయం వస్తోంది. ఇవేకాకుండా రైతులకు అవసరమైన ఎరువులను మార్క్‌ఫెడ్ ద్వారా తీసుకొని సొసైటీల ద్వారా రైతులకు అందిస్తున్నారు. గడిచిన కొన్నేళ్లుగా కొన్నిసొసైటీల పరిధిలో ఆదాయం గణనీయంగానే వస్తున్నా నిధులు మాత్రం సంఘాల్లో జమ చేయడం లేదు. కొంతమంది కలిసి వాటిని పక్కదారి పట్టించారు. సంఘాల బలోపేతానికి ఉపయోగించాల్సి ఉన్నా ఇతర వాటికి ఖర్చు చేశారు. ఎక్కువ మొత్తంలో నిధులను గోల్‌మాల్ చేశారు.

● గత ప్రభుత్వ హయాంలో 28 సొసైటీలో అవకతవకలు

జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో 28 సొసైటీలో అవకతవకలు జరుగగా నోటీసులు జారీచేశారు. ఈ మధ్యే మరో 8 సొసైటీలకు ఈ నోటీసులిచ్చారు. నిధుల అక్రమాలు బయటపడటంతో ఇద్దరుసొసైటీ కార్యదర్శులను కూడా సస్పెండ్ చేశారు. మిగతా సొసైటీలకు నోటీసులు ఇవ్వడంతోపాటు రికవరీ నోటీసులను కూడా పంపించారు. కొన్ని సొసైటీల వారు ఇతర మార్గాల ద్వారా చర్యలను తప్పించుకునేందుకు ప్రయత్నం చేస్తుండగా సహకార శాఖ అధికారులు మాత్రం నిధులను సంఘాలకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా ధాన్యం కొనుగోలుతోపాటు ఎరువుల అమ్మకం ద్వారా వచ్చిన కమీషన్‌ను సక్రమంగా ఈ 36 సొసైటీలో వినియోగించలేదు. వివిధ కారణాలతో పక్కదారి పట్టినట్లు ఆడిటింగ్‌లో గుర్తించారు. వాటికి వివరాలు కోరడంతో పాటు అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లను నియమించి దర్యాప్తును చేస్తున్నారు.

● 36 సొసైటీల పరిధిలో రూ.10కోట్లకు పైనే?

జిల్లాలోని ఈ 36 సొసైటీల పరిధిలో సుమారు రూ.10 కోట్లకు పైనే పక్కదారి పట్టినట్లు సహకారశాఖ అధికారుల తనిఖీల్లో బయటపడ్డట్లు తెలుస్తోంది. ఈ మధ్యే పడగల్ సొసైటీలో జరిగిన అవకతవకలపైన కూడా ఫిర్యాదు అందడంతో తనిఖీలను చేస్తున్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్‌ను దర్యాప్తు అధికారిగా నియమించి వివరాలను తీసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా 36 సొసైటీల పరిధిలో నిధులు పక్కదారి పట్టడంతో రైతులకు రుణాలు ఇవ్వడంతోపాటు డిపాజిట్‌లకు చెల్లించేందుకు ఇబ్బందులు వస్తున్నట్లు అధికారులు భావిస్తున్నారు. కొన్ని సొసైటీల పరిధిలో ఈ సమస్య ఎక్కువగా ఉండటంతో సహకార చట్టం ప్రకారం రికవరీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో మొత్తం 36 సొసైటీల పరిధిలో అవకతవకలను గుర్తించినట్లు జిల్లా సహకార అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. వీటిలో కొన్నిటికి నోటీసులు ఇవ్వడంతోపాటు మరికొన్ని సొసైటీల పరిధిలో రికవరీ యాక్ట్ ద్వారా వసూలు చేసేందుకు సిద్ధమవుతున్నామని తెలిపారు. అవకతవకలకు పాల్పడ్డ ఇద్దరు కార్యదర్శులను కూడా సస్పెండ్ చేసినట్లు తెలిపారు.



నగరంలో అట్టహాసంగా సైక్లింగ్ టోర్నమెంట్

- పాల్గొన్న అంతర్జాతీయ క్రీడాకారులు
- 300 మంది క్రీడాకారుల హాజరుతో సౌత్ ఇండియాలో అతిపెద్ద టోర్నీ
- టోర్నీ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసిన క్రీడాకారులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 14: గతంలో ఎన్నడూ జరగని సైక్లింగ్ పోటీలు ప్రస్తుతం జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయి. రాష్ట్ర, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈపోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వివిధ విభాగాల్లో ఉదయం నుంచి ఈ పోటీలు ఆసక్తికరంగా జరిగాయి. ఐదు రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొని తమ ప్రతిభను చాటారు. ముఖ్యంగా కర్నాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొని ప్రతిభను చాటారు. ఈటోర్నీలో అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొన్నారు. ఏషియన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న క్రీడాకారులు సైతం ఈ పోటీలో తమ సత్తాచాటారు. గతంలో ఎప్పుడూ లేనంతగా సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొని సౌత్ ఇండియాలో అతిపెద్ద టోర్నీగా నిలిచింది. నిర్వాహకులు సైతం ఇంతమంది క్రీడాకారులు ఏ టోర్నీలో పాల్గొనలేదని చెబుతున్నారు. ఈ పోటీలకు క్రీడాకారులు అత్యాధునికమైన సైకిళ్లను వాడారు. వీటి విలువ 4నుంచి 5 లక్షలు ఉండటంతో క్రీడాభిమానులు ఆసక్తిగా సైకిళ్లను తిలకించారు. ఈ టోర్నీలో కర్నాటకు చెందిన క్రీడాకారులు మొదటిరోజు ఏకచక్రాధిపత్యం ప్రదర్శించారు. బంగారు పతకంతోపాటు అన్ని విభాగాల్లో పతకాలను సాధించి మొదటి రోజు చాంపియన్‌గా నిలిచారు.

జిల్లా ఆతిథ్యం బాగుంది..

● గంగా దండెన్, కర్నాటక



గత కొన్నేళ్ల నుంచి అనేక సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్నా. చదుకుంటూ సైక్లింగ్ పోటీలో పాల్గొంటున్నా. మా అక్క కూడా సైక్లింగ్‌లో చాంపియన్‌గా నిలిచింది. ఏకలవ్య అవార్డు కూడా వచ్చింది. నలుగురు అమ్మాయిలున్నా మా అమ్మ, నాన్న క్రీడల పట్ల ఆసక్తితో పోటీలో పాల్గొనేలా కృషి చేస్తున్నారు. జిల్లా అసోసియేషన్ సకల సౌకర్యాలతో పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఆతిథ్యం బాగుంది.

సౌత్ ఇండియాలోనే అతిపెద్ద టోర్నీ..

● విజయ్‌కాంత్‌రావు, రాష్ట్ర, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి



సౌత్ ఇండియాలోనే అతిపెద్ద టోర్నీ జిల్లాలో నిర్వహిస్తున్నాం. ఇలాంటి టోర్నీ సౌత్ ఇండియాలో జరగలేదు. 300మంది క్రీడాకారులు రావడం ఇదే మొదటిసారి. క్రీడాకారుల కోసం అన్నిఏర్పాట్లు చేశాం. క్రీడాకారులు సైతం సంతృప్తిగా ఉన్నారు. ఐదు రాష్ట్రాల క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి ఖేలో ఇండియా ఎంతో ఉపయోగం

- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్
- తొలిరోజు పతకాలన్నీ కైవసం చేసుకున్న కర్నాటక క్రీడాకారులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు14: క్రీడాభివృద్ధికి ఖేలో ఇండియా ఎంతగానో ఉపయోగపడుతుందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. జిల్లాకేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్‌రోడ్‌లో సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం దక్షిణభారత రోడ్ సైక్లింగ్ పోటీలను జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఖేలోఇండియా కేంద్రప్రభుత్వ సహకారంతో ఈపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళల క్రీడాభివృద్ధికి ఖేలో ఇండియా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాల్లోని సుమారు 300మంది బాలికలు, మహిళలు ఈసైక్లింగ్ క్రీడాపోటీలో పాల్గొనడం హర్షనీయమన్నారు. అనంతరం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలు జిల్లాకేంద్రంలో నిర్వహించడం గర్వకారణమన్నారు. మహిళల క్రీడలకు కేంద్రప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు. తొలిరోజు మొదటి సెషన్ అంతా కర్నాటక క్రీడాకారుల హవాసాగింది. అన్ని ఈ వెంట్లలో కర్నాటకకు చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు. ఈక్రీడలు నిజామాబాద్ క్రీడాభిమానులను ఆక ట్టుకున్నాయి. ఎంపీ అర్వింద్ స్వల్ప అస్వస్థతకు గురికావడంతో తదుపరి కార్యక్రమాలన్నీ వాయిదా వేసుకొని హైదరాబాద్ వెళ్లిపోయారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ డైరెక్టర్ నిషావిద్యార్థి, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డి, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కృపాకర్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి భూలోకం విజయ్‌కాంత్‌రావు, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ సుబేదార్, నర్సింగ్‌రావు, సూర్యప్రకాశ్, మాక్స్‌వెల్ కోశాధికారి వెంకటనర్సయ్య, అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధి ఎంకే పాషా, తదితరులున్నారు.



జెండా ఊపి సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ అర్వింద్

● విజేతలు వీరే..

సబ్ జూనియర్ బాలికల 10 కిలో మీటర్ల విభాగంలో కోకిల చవాన్ (కర్నాటక) గోల్డ్ మెడల్, దీపిక పడాతా రే (కర్నాటక) సిల్వర్ మెడల్, జ్యోతి రాథోడ్ (కర్నాటక) బ్రౌంజ్ మెడల్, మహిళా జూనియర్ విభాగంలో 15కిలోమీటర్ల విభాగంలో పాయల్ చవాన్ (కర్నాటక) గోల్డ్ మెడల్, కీర్తినాయక్ (కర్నాటక) సిల్వర్ మెడల్, అయాషా మోహిన్ (కర్నాటక) బ్రౌంజ్ మెడల్, మహిళా ఎలైట్ 20 కిలోమీటర్ల వి భాగంలో నంద చించకంది (కర్నాటక) గోల్డ్ మెడ ల్, దానమ్మ గౌరవ్ (కర్నాటక) సిల్వర్ మెడల్, అక్షత బుటనల్ (కర్నాటక) బ్రౌంజ్ మెడల్.

బాల్కొండ ఖిల్లాలో బాలుడి హత్య

- నాలుగు రోజుల క్రితం మిస్సింగ్
- ఖిల్లాలో విగత జీవిగా..
- పోలీస్‌స్టేషన్ ఎదుట మృతుడి కుటుంబీకుల ఆందోళన



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి

ముప్కాల్, సెప్టెంబరు 14: బాల్కొండ మండలంలోని చిట్టాపూర్‌లో నాలుగు రోజుల క్రితం మిస్ అయిన కచ్చు రాకేష్ (12) బాల్కొండ ఖిల్లాలో హత్యకు గురయ్యాడు. సమాచారం తెలుసుకున్న ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి, ఆర్మూర్‌రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై నరేష్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సంఘటనకు సంబంధించి ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 11న మిస్సిం గ్ అయిన బాలుడి డెడ్‌బాడీ ఖిల్లాలోని చెట్ల పొదల్లో గుర్తించినట్టు తెలిపారు. ముఖంపై గాయాలున్నట్టు, బాడి కుళ్లిపోయిన స్థితిలో ఉందన్నారు. డాగ్‌స్క్వాడ్‌తో ముమ్మర తనిఖీలు చేపట్టారు. డెడ్‌బాడీని పోస్టు మార్టం కోసం ఆర్మూర్ ఆసుపత్రికి తరలించారు. గణపతులు చూసొద్దామని చెప్పి బైక్‌పై ఎక్కించుకొని వెళ్లిన బాల్కొండకు చెందిన బండి నరేందర్ ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు బాలుడి కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపించారు. దీంతో నరేందర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు ఆయన తెలిపారు. బాలుడి మేనమామ అయిన నాగాపూర్‌కు చెందిన దశరథ్ మేకలను సగం పాలుకు మేపేవాడని, ఈ క్రమంలోనే పరిచయం పెంచుకొని ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు తెలుస్తోందని అనుమానం వ్యక్తమవుతోంది. హత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

పోలీస్‌స్టేషన్ ఎదుట నిందితుడిని తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ బాలుడి కుటుంబసభ్యులు, బంధువులు, ఆందోళనకు దిగారు. నిందితుడిన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. నిందితుడిని తమకు అప్పగిం చాలని అప్పటి వరకు డెడ్ బాడీని తీసేదిలేదని పట్టుబట్టారు. నింది తున్ని అరెస్టు చేసి న్యాయం చేస్తామని ఏసీపీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

వసతి గృహాలను తనిఖీ చేసిన కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 14 : నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్‌లోగల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహాన్ని, మోపాల్ మండలం కంజర్‌లోని మహాత్మ జ్యోతిభాపూలే బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, డార్మెంటరీ, స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, ఆఫీస్ స్టాఫ్ రూమ్‌లను ఆయన పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిలువ ఉంచిన సన్నబియ్యం, ఇతర సరుకుల నాణ్యతను విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రతీరోజు మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. బోధనా సిబ్బంది హాజరును, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. విద్యార్థులను పలకరించి వారికి అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలను, రోజువారి దినచర్యను ఆరా తీశారు. జ్యోతిభాపూలే రెసిడెన్షియల్ స్కూల్‌లో నూతనంగా నిర్మించిన భవన సముదాయం, డార్మెంటరీని సందర్శించారు. ఇంకా ఏమైనా మౌలిక సదుపాయాలు అవసరం ఉన్నాయా అని విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, నీటివసతి వంటి అన్ని సదుపాయాలున్నాయని నిర్వాహకులు కలెక్టర్‌కు తెలిపారు. వినాయక్‌నగర్ సాంఘిక సంక్షేమ వసతిగృహం విద్యార్థినిలు ప్రతీరోజు బోర్గాం (పి) పాఠశాలకు వెళ్లి వచ్చేందుకు రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని బడి వేళల్లో ఉదయం, సాయంత్రం బస్సులు ఏర్పాటు చేయాలని హాస్టల్ నిర్వాహకులు కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ వెంట జిల్లా సాంఘిక సంక్షేమ అభివృద్ధి అధికారిని నిర్మల ఉన్నారు.



వసతి గృహంలో బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

నవీపేట, సెప్టెంబరు 14: మండలంలోని నిజాంపూర్ సమీపంలో శనివారం రాత్రి బైక్ అదుపు తప్పి పడిపోవడంతో రాథోడ్ తుకారం అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. నిర్మల్ జిల్లా ముధోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన తుకారం బైక్‌పై నాశేశ్వర్ వైపు నుంచి తన స్వగ్రామానికి వెళుతుండగా నిజాంపూర్ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడటంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయన్నారు. వెంటనే బాధితున్ని 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వారు పేర్కొన్నారు.

గణనాథుల వద్ద హోమాలు, ప్రత్యేక పూజలు



నగరంలో గణపతి మండపం వద్ద హోమం చేస్తున్న దృశ్యం



గణేష్ మండపం వద్ద పూజలు చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



పచ్చలనడ్కుడలో మండపం వద్ద పూజ చేస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు



ధర్పల్లిలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 14: గణపతి నవరాత్రి పురస్కరించుకొని గణపతి ఆలయాలు, మండపాల వద్ద ఘనంగా ప్రత్యేక పూజలు, హోమాలు సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా శనివారం మండపాల వద్ద పెద్ద ఎత్తున హోమ కార్యక్రమాలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలు చివరి దశకు చేరుకోవడంతో భక్తులు గణపతికి విశేష పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. పలు మండపాల వద్ద హోమాలతో పాటు అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహిస్తూ నవరాత్రి ఉత్సవాలను జరుపుతున్నారు. జిల్లా కేంద్రంలోని గణపతి మండపాలను తమ మండప ప్రత్యేకతను చాటుతూ డెకరేషన్ నిర్వహిస్తూ భక్తులను ఆకట్టుకుంటున్నారు. మమ్మదేవి గుడి వద్ద అద్దాల మండపంలో వినాయకుడిని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుండగా వర్ని చౌరస్తా వద్ద 1100 గుమ్మడి కాయలతో గణపతిని తయారు చేసి పూజిస్తున్నారు. నగరంలోని గాజుల్‌పేట్‌లో గల భాగ్యలక్ష్మి గణపతి మండపం వద్ద నిర్వహించిన గణపతి హోమంలో వేదపండితులు గణపతి అధర్వన శీర్షంతో హోమ కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు హోమక్రతులు జరిపారు. బ్రహ్మపురిలోని ప్రసిద్ధ గణపతి క్షేత్రంగా విరాజిల్లుతున్న ఆలయంలో గణపతికి పం చామృత అభిషేకాలు నిర్వహించి అర్చకులు ప్రకాష్ హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మోపాల్: నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే కాలూర్ గ్రామం లో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద శనివారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్తలు ఎమ్మెల్యేను పిలిపించి ప్రత్యేక పూజలు చేయించారు.గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్‌మండపాల వద్ద ఎమ్మెల్యే పూజ లు చేశారు. ఆయా మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలను మండపాల కమిటీ నిర్వాహకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు బిజెపి నాయకులు, కార్యకర్తలు, విడిసి పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ప్రజలు భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మా శరత్ రెడ్డి అన్నారు. బోధన్ పట్టణంలోని రాకాసిపేట్, శక్కర్‌నగర్, పాత బోధన్, తదితర గణేష్ మండపాలలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు ఆయా గణేష్ మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ వినాయకుడిని భక్తిశ్రద్దలతో పూజించి ఆయన దీవెనలతో ప్రజలందరు సుఖశాంతులతో ఉండాలన్నారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని, ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేపట్టామన్నారు. గణేష్ నిమజ్జన శోభాయాత్రతో పాటు నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, శాంతియుతంగా జరుపుకునేందుకు పట్టణ ప్రజలందరు సహకరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు తదితరులున్నారు.

వేల్పూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో కొలువు దీరిన గణపతి మండపాల వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న దానం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులు గణేష్ వద్ద ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వేల్పూర్ గణేష్ మండపం వద్ద పూజలు చేసిన మానాల మోహన్‌రెడ్డి

మండల కేంద్రంలోని గాంధీయూత్, మహాయూత్, ముదిరాజ్ గణేష్ కమిటీ, ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను శనివారం రాష్ట్ర సహకార యునియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సారెడ్డి, టౌన్ అధ్యక్షుడు మల్లేష్, సొసైటీ డైరెక్టర్ రాజేందర్, జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి దామోదర్‌గౌడ్, మహిళ అధ్యక్షురాలు స్వరూప, మండల యూత్ అధ్యక్షుడు రాము, ఇందిరగౌడ్, నరేందర్, రమణ, గంగయ్య, మల్లయ్య, శోభన్, మహేందర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి: మండలంలో గణేష్ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శనివారం మండల కేంద్రంలోగల పద్మశాలి, గురడికాపు, తదితర మండపాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గణనాథున్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కాగా గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం జరిగేందుకు మండల ప్రజలు సహకరించాలని ఎస్సై రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. డిజెలకు ఎలాంటి అనుమతి లేదని మండపాల నిర్వాహకులు సూచించారు.

మెండోర: ఎస్సారెస్పీ జల విద్యుత్ గణేష్ మండలి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ఉత్సవాలను నిర్వహించారు. మిమిక్రీ కళాకారుడు శంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జల విద్యుత్ ఉద్యోగుల కుటుంబాలతో పాటు ఎస్సారెస్పీ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో పిల్లలను ఆకర్షించేందుకు విధంగా మిమిక్రీ కళాకారుడు శంకర్ మాట్లాడే బొమ్మతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ శ్రీనివాస్, డీఈ ప్రవీణ్, ఉద్యోగులు సురేష్, భరత్, శివరాం, మహేష్, గంగాధర్‌తో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మండలంలోని అమృతాపూర్ గ్రామంలో యువ ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం భక్తులను ఆకట్టుకుంటుంది. రంగు రంగులతో విగ్రహం చూటముచ్చటగా కనబటంతో గ్రామ భక్తులు, చుట్టూ పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహిస్తున్నారు. ఆదర్శ యూత్ సభ్యులు ప్రత్యేకత గల విగ్రహ ఏర్పాటు చేయడంతో గ్రామస్థులు వారిని అభినందిస్తున్నారు.

కమ్మర్‌పల్లి: మండలకేంద్రంలోని మండపాల్లో కొలువుదీరి నవరాత్రి పూజలందుకుంటు వినాయక మండపాల్లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి శనివారం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మండలకేంద్రంలోని వింగ్స్‌యూత్ వినాయకుడు, గంగపుత్ర గణేష్ మండలి వినాయకులవద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.పండగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన సుచించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, ఊట్నూర్ ప్రదీప్, బుచ్చిమల్లయ్య, క్యాతంగంగారెడ్డి, రిత్విక్, సుంకరి గంగాధర్, నర్సయ్య, రాకేష్, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నవీపేట: మండల కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో అన్నదానం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి వెంకటేశ్వరకాలనీలోని విద్యానగర్‌లో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద శనివారం అన్నదానం నిర్వహించారు. అంతకు ముందు కాలనీవాసులు అధిక సంఖ్యలో హాజరై మండపంలోని గణేషునికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

పోచారాన్ని కలిసిన నేతలు



పోచారంను అభినందిస్తున్న వర్ని నాయకులు

వర్ని,సెప్టెంబరు 14: రాష్ట్ర వ్యవసాయ సలహాదారునిగా శనివారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు చేపట్టడంతో వర్ని, చందూర్ మండలాలకు చెందిన పలువురు నాయకులు హైదరాబాద్ తరలివెళ్లారు. హార్టికల్చర్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టడంతో పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఆయనకు స్వీట్లు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాలు, గ్రామాలకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాకతీయ కాలువలో గల్లంతైన అశోక్ మృతదేహం లభ్యం

మెండోర, సెప్టెంబరు14: కాకతీయ కాలువలో గల్లంతైన మండల కేంద్రానికి చెందిన గాండ్ల అశోక్ మృతదేహన్ని శనివారం ఉదయం లభ్యమైంది. ఈ సందర్భంగా గురువారం రాత్రి కాకతీయ కాలువలో ప్రమాదవశాత్తు గల్లంతైన అశోక్ శనివారం ఉదయం మృతదేహం లభ్యం కావడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడు కాంగ్రెస్ పార్టీలో చురుకైనా పాత్ర పోషించేవారని రాష్ట్ర సహకార సం ఘం కార్పోరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలి పారు. అశోక్ మృతికి మానాల మోహన్‌రెడ్డికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

మహాకవి నటేశ్వరశర్మకు ఘన నివాళి

పెర్కిట్, సెప్టెంబరు14: ప్రముఖ సంస్కృతాంధ్ర విద్యత్కవి అష్టావధాని గజరోహణ పురస్కృతులు దశరధి పురస్కార గ్రహిత 60పైచిలుకు గ్రంథలు రచించి తెలుగు సాహిత్య లోకానికి అందించిన మహాకవి డాక్టర్ ఆయాచితం నటేశ్వరశర్మకు సంస్మరణ సభ శనివారం ఆర్మూర్ పట్టణంలో సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి నాగుల రాజేందర్‌గౌడ్, చక్రవర్తి రాము, దండు కృష్ణ, గరడి ప్రేమ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఛాత్రోపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఛాత్రోపాధ్యాయులు

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు14: ఆర్మూర్ మున్సిపల్ పరిధి మామిడిపల్లిలోని విజయలక్ష్మీ గార్డెన్‌లో శనివారం ఛాత్రోపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1987-89 బ్యాచ్‌కు చెందిన అప్పటి ఛాత్రోపాధ్యాయులు (టీటీసీ శిక్షణ ఉపాధ్యాయులు) 36ఏళ్ల అనంతరం తిరిగి ఒక చోట కలుసుకొని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. తమకు టీటీసీలో విద్యను బోధించిన గురువులు కరణ్‌మోహన్‌రెడ్డి, మల్లారెడ్డి, చంద్ర ప్రకాష్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, అశోక్, శంకర్, నాగజ్యోతిలను వారు ఘనంగా సన్మానించారు. ఉమ్మడి రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన ఛాత్రోపాధ్యాయులు, కార్యక్రమం నిర్వాహకులు జంగంఅశోక్, పుష్క కర్ రావు, సుజాత, వినయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

బోధన్‌రూరల్,సెప్టెంబరు 14: లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్, బోధన్ అయ్యప్ప సేవ ఆధ్వర్యంలో శనివారం బోధన్ మండలంలోని కుమ్మన్‌పల్లి గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు ఉచితంగా మందులు అందజేశారు. ప్రజలకు బీపీ, షుగర్స్ వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ కుమ్మరి పోశెట్టి, రీజినల్ సెక్రెటరీ సూరబత్తుల శ్రీనివాస్, లయన్ ఆవుల బాలకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ లయన్ వెంకట్రావు, మాజీ ఎంపీటీసీ లయన్ ఆదినారాయణ రెడ్డి, లయన్ కుమ్మరి సవిత, లయన్ గైని పద్మ, లయన్ హన్మంత్ రావు, డాక్టర్ సతీష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

ఖిల్లా, సెప్టెంబరు 14: నగరంలోని మూడవ టౌన్ పరిధిలోని గౌతం నగర్ కు చెందిన రహిలా భాను అనే మహిళ అంగన్‌వాడి సెంటర్‌కు వెళ్లి కోడుగు డ్లు, పాలు తెస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదని మహిళ సోదరుడు ఖాజా హుస్సేన్ ఫిర్యాదు చేశాడు. ఆమెకు ఫోన్ చేస్తే స్విచ్చాఫ్ వస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

బాల్య స్నేహితుడికి ఆర్థిక సహాయం



బాల్య స్నేహితుడికి నగదును అందజేస్తున్న దృశ్యం

ధర్పల్లి, సెప్టెంబరు 14: మండలంలోని దుబ్బాక గ్రామానికి చెందిన తమ బాల్య స్నేహితుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో చిన్ననాటి స్నేహితులు ఆయన కుటుంబానికి 20వేల నగదును అందజేశారు. 1991-92 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు తాము పోగుచేసిన మొత్తాన్ని మృతి చెందిన కుటుంబానికి అందజేశారు. మరో 20వేలతో గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయించి ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, గోవర్ధన్, ప్రేమ్, నర్సయ్య, మురళి, మహేందర్‌గౌడ్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ పాఠశాల తనిఖీ

డిచ్‌పల్లి, సెప్టెంబరు 14:మండలంలోని డిచ్‌పల్లి మండల కేంద్రంతో పాటు ధర్మారం మైనార్టీ పాఠశాల, హాస్టల్ ను శనివారం మండల ప్రత్యేకాధికారి యోహన్ ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్ తో కలిసి తనిఖీ చేశారు. పాఠశాలలో ఆవరణతో పాటు తరగతి గదులను శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన మంచి భోజనం అందిచాలని , మెనూ ప్రకారం వంట కాలు పెట్టాలని ఆయన సిబ్బందికి ఆదేశించారు.

సెప్టెంబరు 17న త్రివర్ణ పతకాలు ఎగరవేయాలి

డిచ్‌పల్లి, సెప్టెంబరు 14: తెలంగాణ 17ను తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా ప్రతీ ఒక్కరు జరుపుకోవాలని అన్ని గ్రామ పంచాయతీల్లో కార్యద ర్శు లు, స్పెసల్ ఆఫీసర్‌లు జాతీయ జెండాలు ఎగరవేసి ప్రజాపాలన దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని ఎంపీడీవో రవీందర్, ఎంపీవో శ్రీనివాస్ గౌడ్ లు ఒక ప్రకటనలో తెలిపారు.

ఏచూరికి సీఐటీయూ నేతల నివాళి

మాక్లూర్, సెప్టెంబరు 14:సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి సందర్భంగా మాక్లూర్ మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో శనివారం సంతాపసభ నిర్వహించారు. ఈ సభలో జిల్లా కార్యదర్శి నూర్జహన్, విఘ్నేష్, రమేష్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. సమకాలిన భారత రాజకీయాల్లో సీతారాం పాత్ర మరువలేనిదన్నారు. ఆయన మరణం దేశంలోని కార్మిక వర్గానికి తీరని లోటు అన్నారు. పార్లమెంట్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేయడంతో పాటు పేద ప్రజల కోసం జీవితాంతం కృషి చేశారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిలు, గంగాధర్, కనకయ్య, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోచారం ప్రమాణ స్వీకారానికి తరలి నాయకులు

కోటగిరి,సెప్టెంబరు 14: రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహదారులుగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి శనివారం ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా కోటగిరి ఉమ్మడి మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఉమ్మడి మండలాల నుంచి మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, సహకార సంఘాల అధ్యక్షుడు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు పోచారంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌కు తరలివెళ్లిన వారిన ఏఎంసీ చైర్మన్ హన్మంతు, మాజీ జడ్పీటీసీలు శంకర్, శంకర్ పటేల్, మాజీ ఎంపీపీ పవన్, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ శాంతేశ్వర్ పటేల్, హెగ్డోలి రాంబాబు, నాగేష్ తదితరులున్నారు.

మిలాద్-ఉన్-నబీ ప్రశాంతంగా జరుపుకోవాలి

డిచ్‌పల్లి, సెప్టెంబరు 14: మండలంలోని మైనార్టీ సోదరులు కుల పెద్దలు , మజీద్ సదర్‌లతో సీఐ మల్లేశ్ లు శనివారం ఠాణాలో మిలాద్ ఉన్ నబీ పండుగ ప్రశాంతం గా జరుపుకోవాలని సూచించారు. పలు గ్రామాల్లో వినా యక నిమజ్జనాలు ఈ నెల 16న ఒకేసారి రెండు పండగలు ఉన్నయని ప్రతి ఒక్కరి సహకరించి శాంతి యు తంగా పండగాలు నిర్వహించుకోవాలని సీఐ,ఎస్సై పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నడిపల్లి, బర్దిపూర్, ఇస్లాంపూర కాలనీల మైనార్టీ సోదరుల పెద్దలు పాల్గొన్నారు.

బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డుకు ఎంపికైన శ్రీవిజ్ఞాన్

ధర్పల్లి, సెప్టెంబరు 14: మండలంలోని రామడుగు గ్రామానికి చెందిన శ్రీవిజ్ఞాన్ హైస్కూల్ ఆల్ ఇండియా ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బెస్ట్ ఎడ్యుకేటర్ అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ కార్యక్రమంలో సభ్యులు పాఠశాలకు చెందిన కరస్పాండెంట్ కల్లెడ రాజరెడ్డికి అందజేశారు. డిజిటల్ సాటిలైట్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ నిర్వహణలో టీఆర్ఎస్ఎంఏ చీఫ్ అడ్వైజర్ యాదగిరి శేఖర్‌రావు, స్టేట్ స్పోక్ పర్సన్ జయసింహాగౌడ్ ఈ అవార్డును అందజేశారు. అవార్డు రావడం పై కరస్పాండెంట్ రాజరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. తమ విద్యార్థులకు మరింత డిజిటల్ క్లాసులు అందిస్తామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మెండోర, సెప్టెంబరు14: మండలంలో పలు బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. అలాగే కోడిచర్ల గ్రామానికి చెందిన ఇట్టెడి నరేంధర్ భార్య అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబసభ్యులును, అలాగే చాకిర్యాల్ గ్రామానికి చెందిన బొంత దేవన్న గుండెపోటుతో మరణించగా వారి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

భీమ్‌గల్: మండల కేంద్రానికి చెందిన చింతలూర్ హరిష్ కుటుంబాన్ని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పరామర్శించారు. హరిష్ తల్లి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకొని కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు బోదిరె స్వామి, నర్సయ్య, అనంతరావు, మల్లెల లక్ష్మణ్, నల్లూరి శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

ముప్కాల్: బాల్కొండ మండల కేంద్రానికి చెందిన బట్టు సంజీవ్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. వారి కుటుంబసభ్యులను, అంజాగౌడ్ భార్య లలిత ఇటీవల మరణించారు అలాగే జలాల్‌పూర్ గ్రామానికి చెందని గుండెటి శ్రీనివాస్ తండ్రి లింగన్న ఇటీవల అనారోగ్యంతో మరణించారు, .ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థినులు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు14: రాష్ట్రస్థాయి బెస్‌బాల్ పోటీలకు సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల పాఠశాలకు ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ రాఘలత తెలిపారు.

బీజేపీ సీనియర్ నాయకుడు మృతి



మనోహర్‌రెడ్డి(ఫైల్

మోర్తాడ్, సెప్టెంబరు14: మండలంలోని పాలెం వాస్తవ్యుడు, సీనియర్ బీజేపీ నాయకుడు, రైతు నాయకుడు, రైతుల కోసం అనేక పోరాటాలు చేసిన ముత్యాల మనోహర్‌రెడ్డి(72) శనివారం మృతి చెందారు. హైదరాబాద్‌లోని తన కుమారుని వద్ద ఉండి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన జిల్లా బీజేపీలో సీనియర్ నాయకుడని, రైతుల కోసం అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. జిల్లాలోని ఆర్మూర్ ప్రాంతంలో పసుపుబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పసుపుబోర్డు అయ్యేంత వరకు పాదరక్షలు ధరించనని శబ్దం చేసిన రైతు నాయకుడు ప్రధాని నరేంద్రమోదీ పసుపుబోర్డు ప్రకటిం చిన అనంతరం పదేళ్ల తర్వాత పాదరక్షణలు ఆంతేగాక ఆర్మూర్ ప్రాంత రైతులకు ఎర్రజొన్న బకాయిలు రూ.11కోట్లు చెల్లించాలని కోరుతూ ఆర్మూర్ తిరుపతికి పాదయాత్ర చేసిన రైతు ఉద్యమ నాయకుడు మనోహర్‌రెడ్డి, ఇయనపాలెం సర్పంచ్‌గా పని చేసి ప్రజల మన్ననాలు పొందారు.ఆయనను రాజకీయాల కు అతీతంగా అన్ని పార్టీల నాయకులు గౌరవించేవారు. ఆయన మృతి పట్ల బాల్కొండ నియోజకర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ సునీల్‌కుమార్ తీవ్ర దిగ్భ్రంతిని తెలియజేస్తూ సంతాపం వ్యక్తం చేశారు.

స్థానిక సంస్థల్లో బీజేపీ సత్తా చాటేలా కృషి చేయాలి

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు14: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటేలా కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్ అన్నారు. శనివారం ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామంలో బీజేపీ మండల పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ గత శాసన సభ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సైనికుడిగా పని చేయడంతో అన్ని గ్రామాల్లో బీజేపీకి అధిక శాతం ఓట్లు వచ్చయన్నారు. అదే విధంగా బీజేపీ సభ్యత్వ నమోదును అత్యధికంగా చేయించాలని కార్యకర్తలను కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్న ప్రజలకు చేసిందేమిలేదని, ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని ఆయన వివరించారు. ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తున్నారని, రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో నెంబర్ వన్‌గా చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, బండి శ్రీహరి, దార్ల చిన్న ముత్తెన్న, భానుచందర్, జగదీష్, శక్తికేంద్రం ఇన్‌చార్జీ ముత్యం, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ నియోజకవర్గ సభ్యత్వ కార్యక్రమాన్ని శనివారం జిల్లా సభ్యత్వ కన్వీనర్ పుప్పాల శివరాజ్, అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్‌లు ప్రారంభించి సభ్యత్వాలు చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అంబాటి నవీన్, సభ్యత్వ మండల కన్వీనర్ ఆరేవపల్లి నర్సయ్య, మండల ప్రధానకార్యదర్శి నక్కల గణేష్, ఐటీసెల్ మండల కన్వీనర్ కొత్తింటి రాకేష్, బూత్ అధ్యక్షులు ఠాకూర్ రాము, గౌరు శివనంద్, ఉట్నూర్ రాంకిషన్, మగ్గిడి లింగం, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తొర్లికొండలో ఘనంగా వెంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి సెప్టెంబరు14: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచే భక్తులు కొండపై చేరుకొని అనంతరం స్వామివారి పల్లకిని కొండపై చుట్టు ప్రదక్షిణ చేయించారు. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, వీడీసీసభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిండు కుండలా ఎస్సారెస్పీ నీటిమట్టం



వరదకాలువ ద్వారా విడుదల అవుతున్న నీరు

ముప్కాల్, సెప్టెంబరు14: శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు ఎగువ గోదావరి పరివాహక పారంతంలో కురుస్తున్న వర్షాలకు ప్రస్తుత ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. పరస్తుతం ప్రాజెక్టులోకి 27315క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. వరదకాలువ హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 19వేల క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుంది. ఎస్కేప్ గేట్లను నీటిని నిలిపి లక్ష్మీకాలువకు 200క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 400క్యూసెక్కుల నీటిని విడుదల జరుగుతుందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు (80.50 టీఎంసీ)ల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

ముప్కాల్‌లో జాతీయ హిందీ దివస్



ముప్కాల్‌లో హిందీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ముప్కాల్, సెప్టెంబరు14: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం పాఠశాల హెచ్‌ఎం గంగారాం అధ్యక్షతన పాఠశాల హిందీ ఉపాధ్యాయులైన ఇందిరా, అనసూయాలను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎంపీడీవో

భీమ్‌గల్, సెప్టెంబరు14: పట్టణ కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సౌకర్యాలను గురించి విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. ఈ హాస్టల్‌లో రెగ్యులర్ వార్డెన్, సీసీ కెమెరాలు మూత్రశాలల మరమ్మత్తు, రూఫ్ లీకేజీ తదితర సమస్యల గుర్తించామని వీటిని జిల్లా కలెక్టర్‌లు, నివేదిక పంపనున్నట్టు ఎంపీడీవో తెలిపారు. విద్యార్థులకు అందజేసి భోజనం పౌష్టికమైనదిగా ఉండాలని అలాగే వంట ప్రదేశంలో పరిశుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు.

గల్ఫ్‌లో గుండెపోటుతో యువకుడి మృతి



రమేష్ ఫైల్

ఇందల్వాయి, సెప్టెంబరు 14: ఉపాధి కోసం గల్ఫ్ దేశం వలస వెళ్లిన యువకుడు గుండెపోటుతో మరణించినట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది. మండలంలోని ఇందల్వాయి గ్రామానికి చెందిన సున్నం రమేష్ (30) యువకుడు బతుకు దెరువు కోసం గత 8 సంవత్సరాలుగా దుబాయ్ వెళ్తూ వస్తున్నాడు. సంవత్సరంన్నర క్రితం ఇం టికి వచ్చి తిరిగి వెళ్లినట్లు తెలిసింది. దుబాయ్‌లో విధులు నిర్వహిస్తున్న రమేష్ బాత్‌రూమ్‌లో స్నానం చేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మరణించడం జరిగిందని అతని స్నే హితులు కుటుంబ సభ్యులకు తెలిపారు. శనివారం ఉదయం మృ తుని సోదరుడు, తల్లికి తెలియడంతో బోరున విలపించారు. తమకుమారుడుని మృతదేహాన్ని త్వరగా స్వస్థలానికి రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రోధిస్తూ తెలిపారు. తమ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. మృతుడికి ఇంకా పెండ్లి కాలేదని అన్నారు. తల్లి భారతికి ముగ్గురు కుమారులు కాగా రమేష్ అందరికంటే చిన్నవాడని అన్నారు.

నిర్ణీత సమయంలో గణపతి నిమజ్జనం చేయాలి

పెర్కిట్, సెప్టెంబరు14: గణపతి నవరాత్రులు పూర్తయిన అనంతరం ఈనెల 17వ తేదీన మంగళవారం గణపతి నిమజ్జనం నిర్ణీత సమయంలో శాంతియుతంగా పూర్తి చేయాలని సర్వసమాజ్ ప్రజా ఐక్య సమితి నవనాథపురం ఆర్మూర్ సభ్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఆకులరాజు మాట్లాడుతూ గణపతి ప్రతిష్ఠపన జరిగే రోజు కాకుండా తరువాతి రోజు గణపతి మూర్తిని ప్రతిష్ఠించి పూజలు చేయడం మనసంస్కృతి కాదని, గణపతి నిమజ్జనం జరిగే రోజు మధ్యాహ్నం లేదా సాయంత్రం గణపతినిమజ్జన ప్రక్రియప్రారం భించి తెల్లవారు జామున సూర్యోదయంలోపు నిమజ్జన ప్రక్రియ ము గించాలని పట్టణంలోని గణేష్‌మండపాల వారికి కోరుతున్నట్టు తెలిపారు.

పీడీఎస్‌యూ 50వ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయండి

ధర్పల్లి, సెప్టెంబరు 14:ఈనెల 30న ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే పిడిఎస్‌యు 50వ వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని సిపిఐఎంఎల్ మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. శనివారం పిడిఎస్‌యు 50వ వార్షికోత్సవ సభకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దామోదర్, సాయిరెడ్డి, అర్చన, మనోజ్ఞ, తేజశ్రీ, రాజేశ్వరి, రాణి, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు సెల్‌ఫోన్‌ల రికవరీ

మాక్లూర్, సెప్టెంబరు14: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నాలుగు సెల్‌ఫోన్‌లు ఇటీవల చోరీకి గురి కాగా వాటిని స్వాధీనం చేసుకుని శనివారం బాధితులకు ఎస్సై రాజశేఖర్ అందజేసినట్టు తెలిపారు. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన సబ్బీర్, బొంకన్‌పల్లి గ్రామానికి సుమలత, అమ్రాద్‌తాండాకు చెందిన బాలాజీ, బోర్గం గ్రామానికి చెందిన మోహన్‌లకు సెల్‌ఫోన్‌లు ఎస్సై అందజేశారు.

నలంద పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

పెర్కిట్, సెప్టెంబరు14: ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి నలంద పాఠశాలలో శనివారం ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు రుచికరమైన భోజనం తయారు చేసిన ఉపాధ్యాయులకు తోటి విద్యార్థులు రుచి చూయించారు. అనంతరం పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, తదిత రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం,పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ అదృశ్యం

మాక్లూర్, సెప్టెంబరు14: మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన తెలుగు అమ్మాయి అనే మహిళ అదృశ్యమైనట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మతిస్థిమితం లేకపోవడంతో ఈనెల 11న ఇంటి నుంచి వెళ్ళి రాకపోవడంతో ఆమె తమ్ముడు మర్ల లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినటుట ఎస్సై తెలిపారు.

పాడైన రోడ్లకు మరమ్మతులు

సిరికొండ, సెప్టెంబరు 14: మండలంలోని వర్జన్ తండా నుంచి మీదిబాయి తాండా వరకు పాడైన రోడ్డు ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశానుసారంగా కాంగ్రెస్ నాయకులు మొ రం పోయించి బాగు చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ రోడ్డు దెబ్బతినడంతో వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు కోతకు గురయ్యాయి. ఈ రోడ్డను రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆదేశాలతో శనివారం మొరం పోయించి మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో మాలావత్ చందర్, బన్నాజి, మో జ్యా, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో రక్తదాన శిబిరం

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 14: మండలంలోని బషీరాబాద్ గ్రామంలో న్యూస్టార్ యూత్ వినాయక మండపం నిర్వాహకుల ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో హా జరైరక్తాన్ని దానం చేశారు. న్యూస్టార్ యూత్ సభ్యులు శంకర్, సౌమిత్, విజయ్, శేఖర్, భరత్, జైనంద్, పాల్గొన్నారు.

వ్యవసాయ మంత్రిని కలిసిన డీసీసీబీ చైర్మన్


మంత్రి కలిసిన డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

వేల్పూర్, సెప్టెంబరు14:తెలంగాణ రాష్ట్ర సహకార వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హైదరాబాద్‌లో శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసినందుకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార సంఘాల తరఫున, రైతాంగం తరఫున మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. రైతులందరికి రుణమాఫీ చేయడంలో ఎదురయ్యే సాంకేతిక సమస్య వల్ల సహకార సంఘాలలో మాఫీ వర్తించని రైతులకు కూడా రుణమాఫీ అయ్యేలా చూడాలని మంత్రిని కోరారు. రుణమాఫీలో ఉన్నసాంకేతిక లోపాలు, ఇతర సమస్యలు త్వరగా సరి చేసి అర్హులందరికి రుణమాఫీ అయ్యే లా చూడా లని కోరగా అందుకు మంత్రి కూడా సానుకూలంగా స్పందించారని డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి తెలిపారు.

కేజీబీవీని సందర్శించిన ప్రత్యేక అధికారి


జాన్కంపేట్ కస్తూర్బాగాంధీలో ప్రార్థనలో పాల్గొన్న ప్రత్యేక అధికారి లింగం

వేల్పూర్,సెప్టెంబరు14:మండలం పచ్చలనడ్కుడ గ్రామశివారులోని జాన్కంపేట్ గ్రామం వద్ద ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం సూపరిండెంట్, ప్రత్యేక అధికారి బి.లింగం సందర్శించి తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల అనుసారం రెసిడెన్షియల్ పాఠశాల తనిఖీలో భాగంగా కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేయడం జరిగిందని అధికారి లింగం తెలిపారు.

● కేజీబీవీ పాఠశాలను పరిశీలించిన ఎంపీవో

నవీపేట: మండలంలోని మోకన్‌పల్లి కస్తూర్బా బాలికల పాఠశాలను శనివారం ఎంపీవో రామకృష్ణ పరిశీలించారు. కలెక్టర్ ఆదేశం మేరకు పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజనవసతులు,సరుకుల వివరాలు,విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు,ఉపాధ్యాయ సిబ్బంది వివరాలు పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారిణి,ఉపాధ్యాయ సిబ్బందిఉన్నారు.

రేపు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

ఖిల్లా,సెప్టెంబరు 14:ఈనెల 16న మిలాద్-ఉన్-నబీ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీస్ సహాయ కమిషనర్ కోటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 7గంటల నుంచి 1గంటల వరకు కొన్ని మార్గాల్లో ట్రాఫిక్‌ను మళ్లీస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బోధన్‌నుంచి వచ్చే వాహనాలను అర్సపల్లి చౌరస్తా నుంచి మళ్లించి రైల్వేగేట్, న్యూకలెక్టరేట్, కాలూర్ చౌరస్తా, ఖాజా హోటల్, బైపాస్, ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా బస్టాండ్‌కు చేరుకోవాలన్నారు.బోధన్ వైపువెళ్లే వాహనాలను ఆర్టీసీ బస్టాండ్, రైల్వే ఫ్లైఓవర్, శివాజీచౌక్, నిజాంకాలనీ, అర్సపల్లి రైల్వేగేట్ మీదుగా వెళ్లాలని ఆయన సూచించారు.ప్రజలు ఈట్రాఫిక్ మళ్లింపను గమనించాలని కోరారు.

వాహనం ఢీకొని మహిళ మృతి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 14: నగర శివారులోని సారంగాపూర్ ఎన్ఎన్ ఫంక్షన్‌హాల్ వద్ద బొలేరో వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. నవీపేట మండలం కోస్లి గ్రామానికి చెందిన సంగీత (45) తన భర్త అబ్బయ్యతో కలిసి బైక్‌పై నిజామాబాద్‌కు వస్తుండగా వేగంగా బొలేరో వాహనం ఢీకొట్టడంతో సంగీత సంఘటన స్థలంలోనే మృతి చెందింది. కళ్లెదుటా భార్య మృతి చెందడంతో అబ్బయ్య షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో అబ్బయ్య స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. హాస్టల్‌లో ఉన్న పిల్లలను కలిసేందుకు భార్య భర్తలు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. 6వ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'రైతు భరోసా, రుణమాఫీని తక్షణమే అమలు చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న రైతు ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు14:రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.15వేల రైతు భరోసా, రూ.2లక్షల రుణమాఫీ తక్షణమే అమలు చేయాలని రైతుఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు వి.ప్రభాకర్, లింగారెడ్డి, దేగాం యాదగౌడ్‌లు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఆరు గ్యారంటీలను ప్రకటించిందని, అందులో ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ, రెండు పంటలకు రూ.15వేల రైతు భరోసా ఇస్తానని హామీ ఇచ్చారన్నారు.అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్న రైతు భరోసా ఇవ్వలేదని, గతప్రభుత్వం రుణమాఫీలో రైతు లను మోసం చేసిందని ఉపన్యాసాలు ఇచ్చి అధికారంలోకి రాగానే కొంత మేరకు రుణమాఫీ చేసిందని తెలిపారు.ఈనెల 16న డివిజన్ పరిధిలో మాట తప్పిన కాంగ్రెస్‌ను నిరసనగా రైతులు ధర్నా చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు ఐక్యకార్యాచరణ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: రాష్ట్రప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రూ.7వేల 5వందల రైతుభరోసా, వరికి 5వంద బోనస్ చెల్లించాలని రైతుల తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్లతో మండల రైతు జేసీఏ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు రైతు జేఏసీ నాయకులు తెలిపారు. శనివారం కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యిందని ఆరోపించారు. ముఖ్యంగా రైతులను హామీలతో మాయలు చేస్తు గద్దెనెక్కి అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. సమావేశం లో రైతు జేఏసీ నాయకులు గడ్డం నర్సారెడ్డి, సారా సురేష్, బషీరి అశోక్, రేగేంట దేవేందర్, రెంజర్ల మహేందర్, బద్రి, బాలయ్య, సంత రాజేశ్వర్, మల్లేష్ యాదవ్, తదితర రైతునాయకులు పాల్గొన్నారు.

పౌరహక్కుల నేతల అరెస్టు అక్రమం

పెద్దబజార్, సెప్టెంబరు 14: రఘునాథ పాలెంలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణకు వెళ్తున్న పౌరహక్కుల సంఘం తెలంగాణ బృందాన్ని పోలీసులు అరెస్టుచేయడం అక్రమం అని దీనిని ఖండిస్తున్నామని రాష్ట్ర నాయకుడు సంగం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆల్గోట్ రవీందర్, కొంగర శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. మన్నూరు రైల్వే స్టేషన్‌లో కొంత మం దిని మన ఊరు బస్టాండ్‌లో కొంత మందిని అక్రమంగా అరెస్టు చేసి అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో పెట్టారని అన్నారు.రాజ్యాంగం ప్రకారం వ్యవహరిస్తామని చెప్పిన కాంగ్రెస్ నేతలు ఎన్‌కౌంటర్‌లకు పాల్పడుతున్నారని వారు విమర్శించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు14: పట్టణంలోని రాజారాంనగర్ కాలనీలో శనివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.జెస్సు అనిల్, పట్టణ ప్రధానకార్యదర్శి పొల్కం వేణు, పులి యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై జిల్లా వైద్యాధికారి సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజశ్రీ

పెద్దబజార్, సెప్టెంబరు 14: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై మలేరియా సబ్ యూనిట్ అధికారులు, నోడల్ సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్‌లు, బ్రీడింగ్ చెక్కర్స్ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించినట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ తెలిపారు. శనివారం పీవోడీటీ వద్ద నిర్వహించిన ఈ సమీక్షలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా ప్రతీ ఆశ కార్యకర్త, ఏఎన్ఎం, సూపర్‌వైజర్ సిబ్బంది గృహ సందర్శన ద్వారా సర్వేను నిర్వహించాలని ప్రతీ జ్వరం కేసు, డెంగీ అనుమానిత కేసుగా భావించి ఆర్డిటి టెస్టులు చేయాలన్నారు.గుండె వ్యాధికి లక్షణాలకు అనుగుణంగా చికిత్స అందించాలని కోరారు.ఆర్డిటీ ద్వారా డెంగీ అనుమానిత కేసులను డెంగీ నిర్ధారణ కోసం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి రిఫర్ చేసి ఎలీసా టెస్ట్ ద్వారా డెంగీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా చూడాలన్నారు. దోమలు పుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అంజన, వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసిన అధికారులు


మోర్తాడ్‌లో రికార్డులను తహసీల్దార్

మోర్తాడ్,సెప్టెంబరు14:మండల కేంద్రంలోని బాలుర వసతి గృహానికి శనివారం తహసీల్దార్ ఎం.సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు.హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను, భోజన వసతులను అడిగి తెలుసుకున్నారు. వంట గదిలోని భోజనాలను పరిశీలించారు.హాస్టల్ పరిసరాలను, భోజనశాలలోని స్టోర్ గదిని, తాగునీటి వసతిని పరిశీలించారు. మూత్ర శాలలను, డ్రైనేజీని తనిఖీ చేసి తగిన సూచనలు అందజేశారు. వసతిగృహం లో కావల్సిన లైబ్రరీకి సంబంధించిన వస తులను మరమ్మతుల కోసం అధికారులకు నివేదికలు పంపిస్తామని తహసీల్దార్ అన్నారు. విద్యార్థులకు హాస్టల్‌లోని సౌకర్యాలు, భోజన వసతుల గురించి అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్ఐ రంజిత్‌కుమార్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సాయికుమార్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 14: రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీలకు జిల్లా ప్రాబబుల్స్ ఎంపిక చేశారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జిజి కాలేజీ మైదానంలో ఈ ఎంపికలను నిర్వహించారు. క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎంపికలను నిర్వహించారు. సుమారు 100 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన సుమారు 25 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రసేన్‌రెడ్డి మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులకు నాలుగు రోజుల పాటు జిజి కాలేజీ మైదానంలో ప్రాక్టిస్ మ్యాచ్‌లు నిర్వహించి ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 15 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు.ఈఎంపికలో కార్యదర్శి వెంకట్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ సురేష్‌బాబు, పారస్, సీనియర్ క్రీడాకారులు ఉన్నారు.

రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలి


మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లను సన్మానిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,సెప్టెంబర్ 14: రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని లింగాయత్ సమాజ్ అధ్యక్షులు లక్ష్మణ్ పటేల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్ రావు దేశాయ్‌లు అన్నారు. శనివారం బోధన్ పట్టణంలో నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గంలో లింగాయత్ సమాజ్ వర్గానికి చెందిన ఎంబెల్లి గంగారాం, యాదప్పలు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లుగా ఎమ్మెల్యే నియమించినందుకు కృతజ్ఞత తెలుపుతూ డైరెక్టర్లను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రతి రైతుకు రుణమాఫీ పూర్తిస్థాయిలో జరిగేలా రైతులకు కావాల్సిన ఎరువులు, తదితర వాటిని అందేలా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనులు చేపట్టి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ మందిరం చైర్మన్ గుండెటి శంకర్, లింగాయత్ సమాజ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓనం పండగ వేడుకలు

● ముస్తాబైన తిరుమల కళాశాల ప్రాంగణం

డిచ్‌పల్లి, సెప్టెంబరు 14 :ఓనం పేరు వింటేనే చాలా మంది మళయాలీలలో మది పులకరిస్తుంది. ఈ సాంప్రదాయనికి వారసాత్వనికి చిహ్నాం ఈ పండగ. మండలంలోని బర్ధిపూర్ శివారులో గల తిరుమల కళాశాలతో పాటు తెలంగాణ ఏడో పోలీస్ బెటాలియన్ పక్కన గల విక్టరీ పాఠశాల లో ఓనం వేడుకలు నిర్వహించేందుకు పాఠశాలను సర్వంగ సుందరంగా ముస్తాబు చేశారు. ప్రతి యేటా ఈ ఓనం వేడుకలను నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సరసాని పద్మజరెడ్డి డైరెక్టర్ పరామేశ్వర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో జిల్లాలో ఎక్కడ లేని విధంగా ముమ్మరంగా ఏర్పాటు చేశారు.

నటేశ్వర శర్మ కృషి వెలకట్టలేనిది

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 14: ఇటీవల మరణించిన అష్టావధాని ఆయాచితం నటేశ్వర శర్మ సంస్కృతం, తెలుగు భాషా ఉన్నతికి చేసిన కృషి వెలకట్టలేనిదని ప్రముఖ కవి వ్యాఖ్యాత పివి చందన్‌రావు అన్నారు. శనివారం స్వర సౌరభం సంస్థ కార్యాలయంలో నటేశ్వర శర్మ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నటేశ్వర శర్మ ఎన్నో వ్యాసాలు, పరిశోధనలు, రచనలు చేశారని అన్నారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్ శర్మ, ప్రసాద్, సుజాత, భాస్కర్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపులో దొంగతనం

ఖిల్లా, సెప్టెంబరు 14: నగరంలోని గజానంద్ మెడికల్ షాపులో దొంగతనం జరిగినట్లు షాపు నిర్వాహకుడు మూడో టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎప్పటిలాగే శుక్రవారం రాత్రి మెడికల్ షాపును బంద్ చేసి వెళ్లాడని మరుసటి రోజు శనివారం వచ్చి షాపులోని కౌంటర్‌ను పరిశీలించగా అందులో ఉన్న రూ.ఒక లక్షా 18వేల కనిపించలేదని ఈ విషయంపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గర్భిణీ, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి


మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,సెప్టెంబర్ 14: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపిలక్ష్మి అన్నారు. శనివారం బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపిలక్ష్మి, సౌజన్య మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. మహిళలు ఆరోగ్యసంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. పౌష్టికాహారంతో మహిళలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పెగడాపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జవేరియా, హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, సుధ, ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్‌లు, ఆశ వర్కర్‌లు, తదితరులున్నారు.

వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

ఖిల్లా, సెప్టెంబరు 14: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఈనెల 15 నుంచి 18 వరకు వ్యాపార లావాదేవీలు ఏమీ జరగవని మార్కెట్ కార్యదర్శి వెంకటేశం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారంతో పాటు వినాయక నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ, జెండా బాలాజీ జాతర సందర్భంగా సెలవు ప్రకటించామని తెలిపారు. మార్కెట్ కార్యక్రమాలు తిరిగి ఈ నెల 19న ప్రారంభమవుతాయని జిల్లాకు చెందిన రైతు సోదరులు గుర్తుంచుకొని తమ వ్యవసాయ ఉత్పత్తులను తీసుకురావాలని కోరారు. ఈ 4 రోజుల పాటు ఎలాంటి వ్యాపార లావాదేవీలు జరగవని ఆయన తెలిపారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74800	రూ.69050	రూ.895

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : ప్రేమికుడు (10.00)
: మత్తు వదలరా (1.30, 7.45, 10.45)
: స్త్రీ-2 (4.30)
స్క్రీన్-2 : ఏఆర్ఎం (తెలుగు 3డి) (12.15, 7.00)
: సరిపోదా శనివారం (3.25, 10.10)
స్క్రీన్-3 : భలే ఉన్నాడే (10.25, 7.30)
: 35-చిన్నకథ కాదు (1.25, 10.30)
: మత్తు వదలరా (4.30)
స్క్రీన్-4 : ఉత్సవం (11.00, 7.15)
: తుంబ్బడ్ (హిందీ) (2.00)
: కలింగ (4.40)
: ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్ (తెలుగు) (10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : 3 (తెలుగు) (10.20)
: సరిపోదా శనివారం (1.25, 7.20)
: మత్తు వదలరా (4.35)
: 35-చిన్నకథ కాదు (10.30)
స్క్రీన్-2 : మత్తు వదలరా (10.45, 1.30)
: ఏఆర్ఎం (తెలుగు 3డి) (4.20)
: 3 (తెలుగు) (7.30, 10.30)
స్క్రీన్-3 : 35-చిన్నకథ కాదు (10.50, 1.50)
: 3 (తెలుగు) (4.35)
: మత్తు వదలరా (7.40, 10.30)

దేవి : మత్తు వదలరా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ఉరుకు పటేలా (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఏఆర్ఎం (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహాల్ : సరిపోదా శనివారం (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్